# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

## తేదీ: 27-05-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆత్మనిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ ప్రతిభను ప్రోత్సహించామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.
- ఓట్ల లెక్కింపు కార్యక్రమం కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ రాష్ట్రాలను ఆదేశించారు.
- ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ 2024 కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమైంది.
- రాష్ట్రంలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

జూన్ 4 వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలనన్నారు. ఆయన ఢిల్లీ నుండి ఈ రోజు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఓట్ల లెక్కింపునకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈవీఎం లను భద్రపర్చిన స్ట్రాంగ్ రూముల వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐ.టి. పరికరాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను చక్కగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, అదనపు సీఈఓ లు పి కోటేశ్వరరావు, ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

==============================

గడచిన అయిదేళ్ళ కాలంలో దేశంలో ఆత్మనిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ ప్రతిభను విశేషంగా ప్రోత్సహించామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉపాధిని పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేసిందని

పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి 'దేశం ముందు' అన్నదే విధానంగా ఉందని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు.
న్యూస్ ఆన్ ఎయిర్

==============================

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ కోసం డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాల పరిధిలోని అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు మొదలైన వాటివి గుర్తించేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

==============================

ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ 2024 కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ రోజు ఉదయం నుండి ప్రారంభమైంది. కౌన్సిలింగ్ మొదటిరోజు ఒకటవ ర్యాంకు నుంచి 12,000 ర్యాంకు వరకు కౌన్సిలింగ్ జరుగుతున్నట్లు నిర్వహకులు తెలియజేసారు . ర్యాంకుల వారీగా ఈ రోజు నుంచి జూన్ 3వరకు ప్రవేశాలు కల్పిస్తారు. వెబ్ ఆధారిత అడ్మిషన్లు కల్పించేందుకు సాంకేతిక విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అదే విధంగా ఈ రోజు నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసి అడ్మిషన్లు కల్పిస్తారు. ఎన్‌సీసీ, ఆర్మీ, స్పోర్ట్స్, పోలీస్, దివ్యాంగులకు ఈ నెల 31 నుంచి జూన్ 30వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.

==============================

నదుల పరిరక్షణ కోసం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ గుజ్జివాడ వెంకట్రావు అన్నారు. శ్రీకాకుళంలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నగర ప్రజలకు జీవనాధారమైన నాగావళి నదిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. నాగావళి కలుషితం కాకుండా పరిరక్షించే కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. కాగా, నగర వాసులు ప్లాస్టిక్ కవర్లు ఇతర ప్లాస్టిక్ వస్తువులు నదిలో వేయవద్దని ఆయన కోరారు.

==============================

సికింద్రాబాద్ లో ఈరోజు సాయంత్రం 4 గంటల 35 నిమిషాలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్- అగర్తల వేసవి ప్రత్యేక ఎక్స్ ప్రెస్ ఏడు గంటలు ఆలస్యంగా అంటే రాత్రి 11 గంటల 35 నిమిషాలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలా వుండగా సత్రగంజిలో ఈరోజు సాయంత్రం 6 గంటలకు బయలుదేరాల్సిన సత్రగంజ్- తాంబరం అంత్యోదయ ఎక్స్ ప్రెస్ 16 గంటల 30 నిమిషాలు ఆలస్యంగా అంటే రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మార్పు చేసామని తెలిపారు. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తోన్న కారణంగా మార్పు చేసినట్లు అధికార్లు వెల్లడించారు.

==============================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరనంలో నైరుతి గాలులు వీస్తున్నాయని అమరవతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కూరుస్తాయని వాతావరణం కేంద్రం అధికారి వివరిస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

==============================

2024 హజ్ యాత్రకు సంబంధించిన మొదటి విమానం ఈ రోజు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరింది. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి, హజ్ ఆపరేషన్స్ చైర్మన్ హర్షవర్ధన్ ఈ రోజు హజ్ యాత్రను ప్రారంభించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 692 మంది ముస్లిం మైనారిటీ వర్గాలుగా హజ్ యాత్రకు పేర్లు నమోదు చేసుకోగా, మొదటి విడతగా ఈరోజు 322 మంది గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి సౌదీ అరేబియా జెడ్డా విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. అదే విధంగా రెండవ విమానం రేపు సాయంత్రం 4:55 నిమిషాలకు 322 మందితో బయల్దేరనుంది. అలాగే, మూడవ విమానం ఈనెల 29న ఉదయం 7.10 ని. లకు 48 మందితో గన్నవరం విమానాశ్రయం నుంచి జెడ్డాకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

==============================

రాష్ట్రంలో ఈరోజు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఈరోజు తెల్లవారుజామున కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. అదే విధంగా, కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై కొవ్వూరు నుంచి తమిళనాడు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందడంపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

==============================

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పెదరామ పంచాయతీ ఉమ్మరవెల్లి గ్రామ సమీపంలో ఈ రోజు జరిగిన ఆటో బోల్తా ప్రమాదంలో పద్నాలుగు మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. ఆటోలో మొత్తం 18 మంది గిరిజనులు ప్రయాణించినట్లుగా పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదం పై రాష్ట్ర ఎస్.టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు స్పందిస్తూ గాయపడిన వారికి మంచి వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

==============================

జిల్లాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం మొదటి రాండమైజేషన్ ద్వారా సిబ్బందిని నియమించామన్నారు. ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని విజయనగర జిల్లా సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ లో ఈ రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ మాధవీలత ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ పై ఈ రోజు శిక్షణా కార్యక్రమం స్థానికంగా నిర్వహించారు.

==============================

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా పనిచేసిన యెర్నేని సీతాదేవి ఈ రోజు ఉదయం హైదరాబాదులో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె ఆంధ్రప్రదేశ్ లోని ముదినేపల్లి శాసన సభా స్థానం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసారు. కాగా, యెర్నేని సీతాదేవి మృతి పట్ల తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

==============================

==============================